మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ సతీమణి మాధవి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కారు గుర్తుకు ఓటేసి ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలి
- డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, వినోద్ కుమార్ సతీమణి మాధవి

కార్పొరేషన్, మే 8: కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నగర డిప్యూటీ మేయర్ స్వరూపారాణి, వినోద్‌కుమార్ సతీమణి మాధవి కోరారు. తెలంగాణచౌక్‌లో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నృత్యాలు, కోలాటాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చే సత్తా వినోద్‌కుమార్‌కు ఉందన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే ఆయనను ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్లిళ్ల జయశ్రీ, గందె మాధవి, వాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో నృత్యం చేస్తున్న మహిళలు

మార్పు అని నమ్మించి నట్టేట ముంచారు

శంకరపట్నం: రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

- గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్
- రాజన్నకు నయా పైసా ప్రకటించని ప్రధాని మోదీ
- ఎంపీగా బాధ్యతలు విస్మరించిన బండి సంజయ్
- శంకరపట్నం రోడ్ షోలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్ కుమార్

శంకరపట్నం, మే 8: మార్పు మార్పు అని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నట్టేట ముంచిందని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్ కుమార్ విమర్శించారు. బుధవారం రాత్రి శంకరపట్నం మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బీళ్లు బారిన నేలలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు. నేడు నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధాల పునాదులపై అధికారం చేపట్టిందని, గ్యారెంటీల అమలులో అట్టర్ ఫ్లాప్ అయిందని దుయ్యబట్టారు. రెండు లక్షల రుణమాఫీ ఎటుపోయిందని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తున్నారా.. అని అడిగారు. లేదని మహిళలు జవాబిచ్చారు. కాంగ్రెస్ నాయకుల దొంగ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని వినోద్‌కుమార్ సూచించారు. బండి సంజయ్ 5 ఏండ్లలో రూ. 5 పని కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. వేములవాడకు వచ్చిన ప్రధాని మోదీ వేములవాడ అభివృద్ధికి నయా పైసా ప్రకటించకపోవడం విచారకమన్నారు.

అధ్వానంగా కాంగ్రెస్ పాలన: రసమయి

నేడు తెలంగాణలో ఎప్పుడు కరెంటు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. ఉచిత బస్సుల్లో నేడు మహిళల పరిస్థితి చూస్తే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న కవ్వంపల్లి సోదరుడే మహిళలను కించపరిచేలా నీచంగా మాట్లాడిన విషయం మహిళలు మరువలేరన్నారు. ఈ నెల 13న వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. వినోద్‌కుమార్ ప్రసంగిస్తున్నంత సేపూ పూలు చల్లుతూ, కేరింతలు కొడుతూ అభిమానులు ఉత్సాహంగా కనిపించారు. మహిళలు ఆటోలు, ట్రాక్టర్లు, తదితర వాహనాల్లో వందలాదిగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సీనియర్ నాయకుడు గడ్డం నాగరాజు, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, విండో చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, చౌడమల్ల వీరస్వామి, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం శ్రీకాంత్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం రోడ్‌షోకు హాజరైన జనం

బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా కరీంనగర్‌లో గురువారం నిర్వహించే తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. బుధవారం తన నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలు, డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు రోడ్ షోకు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, భానుప్రసాద్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, తిప్పర్తి లక్ష్మయ్య, తోట తిరుపతి, సుంకిశాల సంపత్‌రావు, జమీలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

13న ప్రభుత్వోద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

కలెక్టరేట్, మే 8 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా, పోలింగ్ రోజైన ఈ నెల 13న వేతనంతో కూడిన సెలవును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అలాగే, ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4న కూడా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు సీఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు ఎన్నికల సంఘం సెలవులివ్వగా, తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.

పోస్టల్ ఓటింగ్ గడువు పెంపు

కలెక్టరేట్, మే 8: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు వినియోగించుకునే పోస్టల్ ఓటింగ్ గడువును ఎన్నికల సంఘం పెంచింది. ఈ నెల 8 వరకు మాత్రమే ముందుగా అవకాశం కల్పించింది. అయితే, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో పూర్తిగా పాల్గొనకపోవడంతో, ఎన్నికల సంఘం మరో రెండు రోజుల పాటు ఈ నెల 10 వరకు గడువు పెంచుతూ, ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 6,843 మంది ఇతర సెగ్మెంట్లలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కలిగింది. అయితే, వీరిలో బుధవారం వరకు 5,434 మంది మాత్రమే ఓటు వేసినట్లు అధికారిక సమాచారం.

మోదీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం: కొరివి వేణుగోపాల్

తెలంగాణచౌక్, మే 8: దేశంలో మత విద్వేషాలతో రాజకీయం చేస్తున్న మోదీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉందని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో బుధవారం ఆయన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ, మోదీ మరోసారి ప్రధాని పదవి చేపడితే దేశంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సవరించి, ఆర్ఎస్ఎస్ మనువాద రాజ్యాంగాన్ని తీసుకొస్తారని దుయ్యబట్టారు. బీజేపీకి అధికార దాహం తప్ప, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమంపై పట్టింపు లేదన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులకు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్రంట్ సభ్యులు శ్రీధర్, నర్సయ్య పాల్గొన్నారు.

కార్మికుల వ్యతిరేకి బీజేపీని ఓడించాలి

తెలంగాణచౌక్, మే 8: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలు, పుస్తకాలను నగరంలోని కార్మికుల అడ్డాల వద్ద పంపిణీ చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడం కోసం బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

'మత విద్వేషాలను సృష్టిస్తున్న బండి'

తెలంగాణచౌక్, మే 8: రాజకీయ లబ్ధి కోసం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజల మధ్య మత విద్వేషాలను సృష్టిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి ధర్మేంద్ర ఆరోపించారు. నగరంలోని పలు కూడళ్లలో బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి యుగంధర్‌తో కలిసి బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సదాశివరాజు, వెంకటేశ్, మురళి, భాస్కర్, కిరణ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

తెలంగాణచౌక్, మే 8: నగరంలోని ఉస్మాన్ పుర మల్లికార్జున కాంప్లెక్స్‌లో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్, హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 80 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరం ఉన్నవారికి మందులు అందించారని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి విజయ బహెన్ తెలిపారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎంపీపీ

చొప్పదండి, మే 8: గుమ్లాపూర్ గ్రామంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న కూరగాయలు, పండ్ల తోటలు, పంట పొలాలను బుధవారం ఎంపీపీ చిలుక రవీందర్ పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

ఎస్ఆర్ఆర్‌ను సందర్శించిన గ్రూప్ కమాండింగ్ అధికారి

కమాన్‌చౌరస్తా, మే 8 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలను నిజామాబాద్ గ్రూప్ కమాండింగ్ అధికారి సునీల్ అబ్రహం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ కెడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సునీల్ అబ్రహం మాట్లాడుతూ, ప్రతి కెడెట్ దేశ భద్రత కోసం యూనిఫామ్ సర్వీస్‌లోకి జాయిన్ కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రామకృష్ణ, నైన్ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి డేనియల్ రోడ్ జామ్, పరిపాలన అధికారి రాజేశ్ సుబేదార్, మేజర్ సాగర్ సింగ్, ఎస్సారార్ కళాశాల ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ పర్లపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

400 చీరలు పట్టివేత

- సరైన రసీదులు లేకపోవడంతో సీజ్

రాంనగర్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అక్రమంగా డబ్బు, మద్యం, కానుకలు పంపిణీ చేయకుండా కమిషనరేట్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి కోర్టుచౌరస్తా సమీపంలో తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ వ్యాన్ (టీఎస్ 13ఈబీ 2549)ను పరిశీలించగా, ₹3 లక్షల విలువ చేసే 400 చీరలను దొరికాయి. సరైన రసీదులు, ఎలాంటి ఆధారాలు లేవు. దాంతో ఆ చీరెలను స్వాధీనం చేసుకోవడంతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విచారించగా ధర్మపురికి తీసుకెళ్తున్నట్టు చెప్పాడు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్టు కరీంనగర్ టూటౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. తదుపరి చర్యలకు సంబంధించి అధికారులను సంప్రదిస్తామని చెప్పారు.

వాహన తనిఖీల్లో రూ.2 లక్షలకు పైగా నగదు స్వాధీనం

రాంనగర్, మే 8 : కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో రెండు లక్షల తొమ్మిది వేల ఆరు వందల రూపాయలను పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ తిలక్ రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ సరైన ఆధారాలు లేకుండా సదరు నగదు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేస్తున్న మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, మే 8: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ జన్మదిన వేడుకలను బుధవారం నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో 59 కేజీల భారీ కేక్‌ను నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచారు. నగర మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు కేక్ కట్ చేసి, సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అనునిత్యం కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గంగుల చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ వాల రమణారావు, గుగ్లిళ్ల జయశ్రీ, బండారి వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు తాటి ప్రభావతి, నందెల్లి రమ, ఆరె రవి, ఏవీ రమణ, సూర్యశేఖర్, మధు, వోడ్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యక్తిగత సిబ్బంది ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది 30 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర మేయర్ సునీల్‌రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో పలువురు బీఆర్ఎస్‌నాయకులు ఆయనను కలుసుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఎమ్మెల్సీ భానుప్రసాద్, రవీందర్‌సింగ్, రాజేందర్‌రావు, జమీలొద్దీన్, హరిప్రసాద్ తదితరులున్నారు.

కరీంనగర్ రూరల్, మే 8: కరీంనగర్ మండలంలో చామనపల్లి గ్రామంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి గంగుల జన్మదిన కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచారు. అలాగే దుర్శేడ్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో, ఇరుకుల్ల గ్రామంలో మండల కోఆప్షన్ సభ్యుడు సర్వర్ పాషా ఆధ్వర్యంలో, మొగ్దుంపూర్, నగునూర్, బొమ్మకల్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మాట్లాడుతున్న ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, ప్రైవేట్ ఉపాధ్యాయులు

వినోద్‌కుమార్ వెంటే మేమంతా

- ఎన్నికల్లో మద్దతు ప్రకటించిన ప్రైవేట్ ఉపాధ్యాయులు
- ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా ఆయన గెలుపుతోనే సాధ్యం
- ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు

కమాన్‌చౌరస్తా, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కే తమ మద్దతు ఉంటుందని ప్రైవేట్ ఉపాధ్యాయులు, ట్రస్మా రాష్ట్ర సలహాదారు యాదగిరి శేఖర్ రావు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి యాదగిరి శేఖర్ రావు మాట్లాడారు. వినోద్ కుమార్‌కు మద్దతుగా ప్రైవేట్ ఉపాధ్యాయులమంతా స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. చదువుకున్న వ్యక్తి, రాష్ట్ర ప్రయోజనాలు, జిల్లా వాసుల ప్రయోజనాల కోసం పాటుపడే వినోద్‌కుమార్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కరోనా సమయంలో, కేసీఆర్ ప్రభుత్వంతో పాటు వినోద్‌కుమార్ ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా నిలిచి అందించిన సహకారాన్ని గుర్తు చేశారు. కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్ స్మార్ట్ సిటీ తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. అలాంటి వ్యక్తి మళ్లీ ఎంపీగా గెలిస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు సైతం హెల్త్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా ఆయన గెలుపుతోనే సాధ్యమన్నారు. తాము స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్న క్రమంలో ఎంతోమంది ప్రజలు వినోద్ కుమార్‌కు మద్దతు తెలుపుతున్నారని, ఇది ఎంతో స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఇక్కడ ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నిరసన తెలుపుతున్న డాక్టర్లు

డాక్టర్ శ్రవణ్ పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి
- హెచ్ఆర్‌డీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారి రాజ్ కుమార్
- కరీంనగర్‌లో భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేసిన వైద్యులు

విద్యానగర్, మే 8: కోరుట్లలో ప్రభుత్వ వైద్యుడు శ్రవణ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి, ఆయనపై దాడికి పాల్పడిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ లోని మంచిర్యాల చౌరస్తాలో కరీంనగర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, డాక్టర్లపై దాడులకు పాల్పడిన వారిపై 2008 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ ఘటనపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అధికారులు స్పందించకపోతే పెన్‌డౌన్‌తో పాటు స్టెత స్కోప్ డౌన్ చేపడతామన్నారు. నిరసన కార్యక్రమంలో హెచ్ఆర్‌డీఏ ప్రతినిధులు శరణ్ సాయి, గౌతమ్, శేష శైలజ, చైతన్య రెడ్డి, శ్రీలక్ష్మి, సీనియర్ వైద్యులు రమణాచారి, విజయ మోహన్ రెడ్డి, రంజిత్, మహేశ్, వెంకటేశ్వర్లు, చాట్ల శ్రీధర్‌తో పాటు ఐఎంఏ మహిళా విభాగం వైద్యులు, ధాన వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహాన్

గంగాధర/ కొత్తపల్లి, మే 8 : కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలతో ధాన్యం తడిసిన రైతులు ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకూ మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహాన్ భరోసా ఇచ్చారు. బుధవారం గంగాధర మండలంలోని మధురానగర్, గంగాధర మార్కెట్ యార్డులో, కొత్తపల్లి పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, విధిగా రైతుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. కొత్తపల్లిలో ధాన్యం అమ్మిన ఒక రైతుతో నేరుగా సెల్ ఫోన్‌లో మాట్లాడి భరోసా కల్పించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేశ్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజాచార్య, డీఆర్డీవో శ్రీధర్, పలువురు అధికారులు ఉన్నారు.

'విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన మోదీ'

హుజూరాబాద్ టౌన్, మే 8: కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక(జేఏసీ)చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో రాష్ట్రంలో నవోదయ లేదా కేంద్రీయ పాఠశాలలను ఏమైనా ప్రారంభించారా అని ప్రశ్నించారు. దేశంలో తిరోగమన విధానాలను అమలుపరుస్తున్న మోదీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, కేయూ విద్యార్థి జేఏసీ నాయకుడు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ఆరు గ్యారెంటీలు

గంగాధర, మే 8: ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 15లోగా ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా ఎప్‌సెట్

తిమ్మాపూర్, మే 8: జిల్లా వ్యాప్తంగా ఎప్‌సెట్ పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. తొమ్మిది సెంటర్లలో కేవలం ఒకే షిఫ్టులో ఉదయం 9–12గంటల వరకు అధికారులు పరీక్ష నిర్వహించారు. అన్ని సెంటర్లలో కలిపి 2931 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 2738మంది పరీక్ష రాశారు.

బీఆర్ఎస్ ప్రచార జోరు

- ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించిన పార్టీ శ్రేణులు

తిమ్మాపూర్/ తిమ్మాపూర్ రూరల్/ గంగాధర/ హుజూరాబాద్‌టౌన్/ వీణవంక/ చొప్పదండి/ మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/ చిగురుమామిడి, సైదాపూర్, గన్నేరువరం, మే 8: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. ఊరూరా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు, అభిమానులు ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థిస్తుండగా, ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. తమ మద్దతు బీఆర్ఎస్‌కేనంటూ అన్ని వర్గాలు మద్దతు ప్రకటిస్తుండడం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిస్తున్నది. తిమ్